
సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం ౹ 2 ౹ ఆగస్టు ౹ 2025



## ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని కూనంనేని సాంబశివరావు అన్నారు.

వివరాలు 8లో ▸



## 19 క్రస్టు గేట్ల ఎత్తివేత

జూరాల ప్రాజెక్టులో 19 క్రస్టుగేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 34.6 /22.1

## వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

# లక్ష్యం దిశగా ముందుకు

## నీతి ఆయోగ్ సంపూర్ణ అభియాన్‌లో గట్టుకు కాంస్య పతకం



గట్టు ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు(ఫైల్)

- నేడు రాజ్ భవన్‌లో అవార్డు అందుకోనున్న కలెక్టర్ బీఎం సంతోష్
- 6 అంశాలకు 3 అంశాల్లో వంద శాతం లక్ష్య సాధన
- సంపూర్ణ అభియాన్‌లో అధికారుల సమష్టి కృషికి గుర్తింపు

గట్టు: దేశ వ్యాప్తంగా వెనుకబడిన మండలాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ సంపూర్ణ అభియాన్ ద్వారా మండలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే దేశ వ్యాప్తంగా 500 మండలాలను ఎంపిక చేయగా, అందులో గట్టు మండలం కూడా ఉంది. ఈమేరకు కలెక్టర్ బీఎం సంతోష్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారు. అధికారుల శ్రమకు తగిన ఫలితం లభించింది. 6 అంశాలను పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం వాటికి ర్యాంకులు ఇవ్వగా.. గట్టు మండలానికి 5వ ర్యాంకు లభించిన విషయం తెలిసిందే. దీంతోపాటుగా దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళ నాడు, కేరళ రాష్ట్రాలను జోన్ -3గా గుర్తించగా ఈ జోన్-3 లో గట్టు మండలం అభివృద్ధి సూచికలో 2వ ర్యాంకును సాధించింది.

| 2024లో గట్టు పీహెచ్‌సీలో ప్రసవాల వివరాలిలా.. | | |
|---|---|---|
| జూలై | ఆగస్టు | సెప్టెంబర్ |
| 41 | 44 | 39 |

30 ఏళ్లకు పైబడిన వారికి వైద్య పరీక్షలు ఇలా..

| బీపీ పరీక్షలు చేసింది | షుగర్ పరీక్షలు చేసింది |
|---|---|
| 40,560 | 40,350 |



రాయాపురంలో గర్భిణికి సూచనలు చేస్తున్న ఏఎన్‌ఎం, ఆశాలు

### గట్టుకు కాంస్యం

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం పని చేస్తున్న నీతి అయోగ్ సంపూర్ణ అభియాన్‌లో భాగంగా 6 అంశాలకు గాను 3 అంశాల్లో వంద శాతం లక్ష్యాలను చేరుకున్న క్రమంలో గట్టు మండలానికి కాంస్య పతకం లభించింది. ఈ మేరకు శనివారం గవర్నర్ చేతుల మీదుగా రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో కలెక్టర్ బీఎం సంతోష్ కాంస్య పతకాన్ని అందుకోనున్నారు. వైద్య విభాగానికి సంబంధించి ఏఎన్‌సీ (గర్భిణుల) నమోదు విషయంలో 100 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. 2024 జులై నుంచి సెప్టెంబర్ వరకు చేపట్టిన అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకులను కేటాయిస్తారు. ఇందులో భాగంగానే 2024 జూలై నుంచి సెప్టెంబర్ వరకు గట్టు మండలంలో 3 నెలల గర్భం దాల్చిన వారి వివరాలను సేకరించి, యాప్‌లో నమోదు చేయగలిగారు. ఇలా 3 నెలలు, 6 నెలలు, 7 నెలలు, 8 నెలల గర్భస్థ సమయంలో వారికి పరీక్షలను నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పు చేయించే విధంగా క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ టీచర్లను మండలస్థాయి అధికారులు సమన్వయం చేయడం ద్వారా వంద శాతం లక్ష్యాలను చేరుకున్నారు. అలాగే గట్టు మండలంలో 30 ఏళ్లపై బడిన సుమారు 40 వేల మందికి పైగా మండలంలో ఉచితంగా బీపీ (హైపర్‌టెన్షన్), షుగర్ పరీక్షలను నిర్వహించి, రికార్డుల్లో, యాప్‌లో నమోదు చేయడం ద్వారా వంద శాతం మేరకు లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇలా 3 అంశాల్లో వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్న తరుణంలో గట్టు మండలానికి కాంస్య పథకం వరించింది. మిగతా అంశాలు గర్భిణులు, బాలింతలకు పోషకారం అందించే అంశంలో కేవలం 75 శాతం, మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ అందించడంలో 95 శాతం, భూసార పరీక్షలు(జులై నుంచి సెప్టెంబర్) వర్షాకాల సిజన్ కావడంతో ఇందులో అనుకున్న మేర లక్ష్యాన్ని చేరుకోలేకపోవడంతో ప్రస్తుతానికి 3 పాయింట్లతో కాంస్య పథకాన్ని సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

# న్యూస్‌రీల్

## వైద్య పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: అలంపూర్ ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్టు విధానంలో వైద్యాధికారుల నియామకాలు చేపడుతున్నట్లు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌చంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలంపూర్ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్-2, జనరల్ సర్జన్-2, జనరల్ మెడిసిన్-2, అనస్తిటిస్ట్-2, ఈఎన్‌టీ-1, ఆర్థోపెడిక్-1, పాథాలజిస్ట్-1, సైక్రియార్టిస్ట్-1, డెర్మటాలజిస్ట్-1 పోస్టు ఖాళీగా ఉన్నాయని, అదేవిధంగా అలంపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జనరల్ మెడిసిన్-1, పిడియాట్రీషియన్-1, జీడీఎంవో(ఎంబీబీఎస్)-2 కాంట్రాక్టు పోస్టులకు దరరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు ఈనెల 7వ తేదీన అలంపూర్ ఏరియా ఆసుపత్రి, అలంపూర్ క్రాస్‌రోడ్డులో వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

## ఆపరేషన్ ముస్కాన్‌లో 75 మంది బాలలకు విముక్తి

గద్వాల క్రైం: జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ -11 విజయవంతమైందని, మొత్తం 75 మంది బాలకార్మికులను గుర్తించి విముక్తి కల్పించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గద్వాల - అలంపూర్ సెగ్మెంట్‌లో జులై 1 నుంచి 31వ తేదీ వరకు పోలీసు, కార్మిక, విద్య, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేశాయని, పలు ప్రాంతాల్లో బాలకార్మికులుగా పని చేస్తున్న 75 మంది చిన్నారులను గుర్తించి వారిని వెట్టి నుంచి విముక్తి కల్పించామని తెలిపారు. అనంతరం చిన్నారులను పాఠశాలలో చేర్పించామని, వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై 18 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైన చిన్నారులను పనిలో పెట్టుకుంటే డయల్ 100 లేదా 1098కు సమాచారం అందించాలని, ఆపరేషన్ ముస్కాన్‌లో విధులు నిర్వహించిన సిబ్బంది కృషి మరువలేనిదని తెలిపారు.

## కేంద్రం నిధులిస్తే.. కాంగ్రెస్ ప్రారంభోత్సవాలా ?



అలంపూర్: కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చి నిర్మిస్తే కాంగ్రెస్ మంత్రులు ప్రారంభోత్సవాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. అలంపూర్‌లోని ప్రసాద్ స్కీం భవనంలో బాలబ్రహ్మేశ్వర నిత్య అన్నదాన సత్రాన్ని, ఏర్పాట్లను ఆయనతోపాటు బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రం ప్రసాద్ స్కీం పథకం ద్వారా జోగుళాంబ ఆలయానికి 2021లో రూ.80 కోట్లు పలు భవనాలు, అభివృద్ధి పనుల కోసం కేటాయించారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం రూ.36.72 కోట్లు మాత్రమే వినియోగించుకున్నట్లు తెలిపారు. నిర్మించిన వసతి గృహాలను సైతం వినియోగంలోకి తేవడానికి సరైన చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ భవనంలో భక్తుల సౌకర్యార్థం కళ్యాణమండపం, ఆడిటోరియం వంటివి అందుబాటులోకి రావాల్సి ఉందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల ప్రసాద్ స్కీంలోని సౌకర్యాలతోపాటు నిత్య అన్నదాన సత్రం తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం ఉపాధ్యక్షుడు రాజశేఖర్ శర్మ, బీజేపీ నాయకులు రాజగోపాల్, నాగేశ్వర్ రెడ్డి, శరత్, ఈశ్వర్, మురళికృష్ణ, రామకృష్ణ, నాగమల్లయ్య ఉన్నారు.

## జీవన ప్రమాణాలు మెరుగుపడాలి: వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఆర్థిక క్రమశిక్షణ అవసరం అని పాలమూరుయూనివర్సిటీ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఆర్థిక విద్య, జీవన నైపుణ్యాలు అనే అంశంపై ఒకరోజు జాతీయ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం నైపుణ్య ఆధారిత పరిజ్ఞానం అవసరం అన్నారు. విద్యార్థి దశలోనే ఆర్థిక అవగాన పెంచుకుని, దేశ స్థూల జాతీయోత్పత్తిలో మీ వంతు పాత్ర పోషించాలన్నారు. కీనోట్ స్పీకర్, సీనియర్ కన్సల్టెంట్ బ్రహ్మ, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, మధుసూదన్ రెడ్డి, అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

## వేరుశనగ క్వింటా రూ.6,570

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శుక్రవారం 622 క్వింటాళ్ల వేరుశనగ రాగా గరిష్టం రూ. 6570, కనిష్టం రూ. 2276, సరాసరి రూ. 5370 ధరలు లభించాయి.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఉచితం

గద్వాల: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన ఇసుకను ఉచితంగా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో ఇసుక బుకింగ్ విధానంపై రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అవసరమైన ఇసుక సరఫరా కోసం తుమ్మిళ్ల ప్రాంతంలో ఒక ఇసుక రీచ్‌ను గుర్తించామని, రేట్‌చార్జ్‌ను సిద్ధం చేసి లబ్ధిదారుల జాబితాను త్వరగా ఇస్తే వారికి ఉచిత ఇసుకను వెంటనే పంపిణీ చేసేలా ప్రణాళిక చేశామన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి 25క్యూబిక్ మీటర్ ఇసుకను అందించనున్నట్లు తెలిపారు. ఇసుక రవాణాకు ట్రాక్టర్ యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకున్న ట్రాక్టర్లు, సొంత ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసుకోవాలని సూచించారు. ఇసుక పక్కదారి పట్టకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఎస్‌డీసీ శ్రీనివాస్ రావు, హౌసింగ్‌పీడీ కాశీనాథ్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతోపాటు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ

# మహిళా హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

గద్వాలటౌన్: దేశంలో మహిళా హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఐద్వా జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో స్త్రీ, పురుషులకు అనేక హక్కులను ప్రకటించిన ప్పటికి సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం లేదని.. విద్యా, వైద్యం, ఉపాధి రంగాలలో స్త్రీలు ఇప్పటికి వెనుకబడే ఉన్నారని చెప్పారు. చట్టరీత్యా హక్కులున్నా అవేవీ స్త్రీలకు అందుబాటులో లేవన్నారు. వీటికి తోడు హత్యాచారాలు, వరకట్నపు మరణాలు, కుటుంబంలో హింస, బలవంతపు పెళ్లిలు, బాల్యవివాహాలు, బహు భార్యత్వం వంటి అనేక సమస్యలు స్త్రీలను వేధిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వీటిని అరికట్టేందుకు సమగ్రమైన ప్రతిపాదిత చట్టాలు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి అనే నినాదంతో ఐద్వా పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, కమిటీ సభ్యులు పద్మ, రత్నమ్మ, రాణి, సుధా, పద్మ, భాగ్యమ్మ, అమ్ములు, రాధా, కైయూమ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన

మల్దకల్ : మండల కేంద్రమైన మల్దకల్, కుర్తిరావుల చెర్వు గ్రామ పరిసరాల్లోని ప్రభుత్వ భూమిని శుక్రవారం కేంద్రీయ విద్యాలయ అధికారులు కృష్ణవేణి, హరిప్రసాద్, డీఈఓ అబ్దుల్ ఘని పరిశీలించారు. మల్దకల్ తహసీల్దార్ ఝాన్సీరాణి, ఎంఈఓ సురేష్‌ల ఆధ్వర్యంలో మల్దకల్ టూరిజం శాఖ నిర్మించిన అతిథిగృహాన్ని తాత్కాలిక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి నిర్మాణాలు చేపట్టే వరకు ప్రస్తుతం వాటిలో పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుతో గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శాంతిరాజు, సూపరింటెంట్ వీరశేఖర్, సర్వేయర్ హరికృష్ణ, ఆర్ఐ మద్దిలేటి తదితరులు ఉన్నారు.



మల్దకల్ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

# రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు వేగవంతం



జోగుళాంబ రైల్వే హాల్ట్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ

అలంపూర్‌లో చేపడుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు వేగవంతం చేసి.. వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్, గద్వాల, జోగుళాంబ రైల్వే హాల్ట్‌కు చేరుకొని అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు.

– గద్వాల న్యూటౌన్/ఉండవెల్లి

వివరాలు 8లో ▸

# హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి..
- నిర్లక్ష్యం వహిస్తే వేటుతప్పదు
- కలెక్టర్ బీఎం సంతోష్




సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: గురుకులాలు, సంక్షేమ శాఖల వసతిగృహాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ బీఎం సంతోష్ హెచ్చరించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పాఠశాలలు, హాస్టళ్లల్లో నిర్వాహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా తగిన వేటుతప్పదన్నారు. ఇటీవల ఓ పాఠశాలలో జరిగిన ఘటనపై సంబంధిత డిప్యూటీ వార్డెన్, సూపర్‌వైజర్‌లను సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. నిర్లక్ష్యం వహించిన ఇతర సంబంధిత అధికారులకు కూడా మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంక్షేమం కోసం మండల స్థాయి అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్ని మండలాలకు జిల్లా స్థాయి స్పెషల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ప్రతినెలా కనీసం రెండుసార్లు పాఠశాలలు సందర్శించి అక్కడి విద్య, భద్రతా, మౌళిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు ఇతర అవసరాలను సమీక్షించాలన్నారు. విద్యార్థులకు ప్రతిరోజు మెను ప్రకారం నాణ్యమైన పోషకాహారంతో కూడిన భోజనం తప్పనిసరిగా అందించాలన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే తహసీల్దార్, ఎంపీడీవో పోలీసు అధికారులకు తెలియపర్చాలని తహసీల్దార్ మండల స్థాయి మెజిస్ట్రేట్ వెంటనే స్పందించాలన్నారు.

**బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

అనంతరం ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. జిల్లాల్లో ఎలాంటి సంఘటన జరిగిన వెంటనే పోలీసుశాఖ అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటుందని, వసతిగృహాల ప్రతివిషయం అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తులు ఎవరైనా విద్యార్థులను రోడ్డుపైకి వచ్చేలా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాల్లోకి బయటి వారిని అనుమతించకూడదని వసతిగృహాల విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యాలయాల ఆవరణలో ఎవరైనా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మండల స్థాయిలో అధికారులు, పోలీసువిభాగం పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, ఆర్డీవో అలివేలు, అధికారులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్తీదవాఖానాను ఆకస్మింకగా తనిఖీ చేశారు. దగ్గు, జలుబు, జ్వరం నివారణకు సంబధించి మెరుగైన వైద్యం అందించాలని, దోమల నివారణకు ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్ వంటి నివారణ కారకాలను ఉపయోగించాలన్నారు.

**ఎరువుల కొరత సృష్టింవొద్దు**

రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, వాటి కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ అన్నారు. రైతు నుంచి ఆధార్ వివరాలు సేకరించిన అనంతరమే యూరియా విక్రయాలు చేయాలని, ఈ-పాస్ ద్వారా అమ్మకాలు జరగాలన్నారు. జిల్లాలో ఎరువుల నిల్వలు, వినియోగంపై సమగ్ర నివేదికను ఇవ్వాలని డీఏవో సక్రియానాయక్‌ను ఆదేశించారు.

# టీచర్లకు తీపికబురు

## నేటినుంచి ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం

- ఎస్జీటీలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం, ఎస్ఏలుగా అవకాశం
- స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్
- ఉమ్మడి జిల్లాలో 650 నుంచి 750 మందికి మేలు
- ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యాశాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా అర్హులైన సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించనుంది. గత మూడేళ్ల క్రితమే ప్రమోషన్లు ఇచ్చిన తాజాగా ప్రభుత్వం మరోసారి ప్రక్రియ చేపట్టాలని పేర్కొంటూ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2,991 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 14,221 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న పదోన్నతులతో సుమారు 650 నుంచి 750 మంది ఉపాధ్యాయులు అర్హత పొందే అవకాశం ఉందని విద్యాధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఎస్జీటీలుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించనున్నారు. ఇక స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా, ఎంఈఓలుగా పదోతున్నతులు ఇచ్చే అవకాశం ఉంది.

### ఈ నెల 11 వరకు..

ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ శనివారం నుంచే ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఆయా జిల్లాల వారీగా డీఈఓ వెబ్‌సైట్‌లో గ్రేడ్-2 హెడ్ మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ సమానమైన క్యాడర్ ఖాళీల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది. వీటితోపాటు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందాల్సిన ఎస్జీటీ ఉపాధ్యాయులు సీనియార్టీ ప్రొవిజనల్ లిస్టు, స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు పొందనున్న ఎస్జీటీల ప్రొవిజనల్ సీనియార్టీ లిస్టును ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి. ఈ మేరకు సీనియార్టీ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పుకొనేందుకు ఈ నెల 3న అవకాశం ఉంటుంది. అలాగే 4, 5 తేదీల్లో సీనియార్టీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితా విడుదల చేస్తారు. 6న పదోన్నతులకు అర్హులైన వారు వెబ్‌ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం ఉంది. 7న సంబంధిత ఆర్జేడీ, డీఈఓల నుంచి ప్రమోషన్ ఆర్డర్ వెలువడనున్నాయి. ఇలా మొదట హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల ప్రక్రియను ఈ నెల 11 వరకు పూర్తి చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.


### నిలిచిన డిప్యూటేషన్లు..

ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఎంఈఓల నుంచి డిప్యూటేషన్ ఇవ్వాల్సిన ఉపాధ్యాయుల వివరాలను డీఈఓలు సేకరించారు. వీటికి కలెక్టర్ అనుమతితో ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 680 మందికి డిప్యూటేషన్లు ఇవ్వాల్సి ఉండగా ఒక్క మహబూబ్‌నగర్‌లోనే 330 మంది బదిలీ కావాలి. కానీ, ప్రస్తుతం ప్రభుత్వం పదోన్నతుల ప్రక్రియను చేపట్టనున్న నేపథ్యంలో డిప్యూటేషన్లు నిలిచిపోయాయి. పదోన్నతుల అనంతరం అక్కడ ఏర్పడిన ఖాళీల ఆధారంగా డిప్యూటేషన్లు చేపట్టనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పదోన్నతుల ప్రక్రియ ఈ నెల 11లోగా పూర్తయితే 15లోగా డిప్యూటేషన్లు కూడా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

### ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

| జిల్లా | పాఠశాలలు | విద్యార్థులు | ఉపాధ్యాయులు |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 791 | 62,724 | 4,650 |
| నాగర్‌కర్నూల్ | 808 | 54,152 | 3,513 |
| వనపర్తి | 495 | 38,147 | 2,097 |
| జోగుళాంబ గద్వాల | 448 | 55,289 | 2,064 |
| నారాయణపేట | 458 | 52,314 | 1,879 |

### షెడ్యూల్ ప్రకారమే..



ప్రభుత్వం ప్రమోషన్లకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 11లోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా ఆదేశించింది. అందులో భాగంగా ఆదివారం సీనియార్టీ లిస్టులను ప్రదర్శిస్తాం. జిల్లా పరిధిలో 1:3 ప్రకారం 450 మందిని ఎంపిక చేసి 150 మందికి ప్రమోషన్లు వచ్చే అవకాశం ఉంది. ఇక డిప్యూటేషన్లు ఆగిపోయే అవకాశం లేదు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఫైల్ ప్రాసెస్ చేసి డిప్యూటేషన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ కూడా తప్పిదాలకు తావులేకుండా ప్రక్రియ నిర్వహిస్తాం.

– ప్రవీణ్‌కుమార్, డీఈఓ, మహబూబ్‌నగర్

## క్లుప్తంగా

### వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి


గడ్డం సాయిమ్మ (ఫైల్)

**పాన్‌గల్:** బొలెరో ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన గడ్డం సాయమ్మ(70) గ్రామ పంచాయతీ వద్ద ఆసరా పింఛన్ తీసుకునేందుకు వెళ్తోంది. దొండాయిపల్లి నుంచి వస్తున్న బొలేరోకు ఎదురుగా స్కూల్ బస్సు రావడంతో రివర్స్ తీసుకునేక్రమంలో వెనుక నడుచుకుంటూ వెళ్తున్న సాయమ్మను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు గడ్డం స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతురాలి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ రాములు, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


వెంకటేశ్ (ఫైల్)

**అమరచింత:** మండలంలోని పాంరెడ్డిపల్లె గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉంద్యాలకు చెందిన వెంకటేశ్ (52) అమరచింతలోని వైన్‌షాపులో పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి పనిముగించుకొని ఉంద్యాలకు బైక్‌పై వెళ్తుండగా పాంరెడ్డిపల్లే గ్రామం దాటిన తర్వాత కెనాల్ సమీపంలో బైక్‌కు ఎదురుగా పంది అడ్డురావడంతో తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. తలకు గాయం కావడంతో చికిత్స కోసం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావంతో మృతి చెందాడు. మృతుడి భార్య బండారి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాములు తెలిపారు.

### కానిస్టేబుల్‌కు రిమాండ్

**గట్టు :** మండల పరిధిలోని చిన్నోనిపల్లె గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడును శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ప్రియాంక అనే అమ్మాయిని ప్రేమించి, పెళ్లి చేసుకోకుండా నిరాకరించిన వ్యవహారంలో రఘునాథ్‌గౌడుతో పాటుగా కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గద్వాల డీఎస్పీ మొగులయ్య ఆధ్వర్యంలో విచారణ చేపట్టి కానిస్టేబుల్ రఘునాథ్‌గౌడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### బాలిక అదృశ్యం: కేసు నమోదు

**బల్మూర్:** మండల కేంద్రానికి చెందిన బాలిక అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం బహిర్భూమికి కోసం బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### అదనపు కట్నం కోసం వేధింపులు

**తిమ్మాజిపేట:** మండలంలోని గొరిటకు చెందిన జక్సాన బేగంను భర్త, అత్త, మామ, ఆడపడుచులు అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. జక్సాన బేగంను మహబూబ్‌నగర్ మండలం ఎదిర గ్రామానికి చెందిన ఫైసల్‌కు ఇచ్చి వివాహం చేశారు. రెండున్నర సంవత్సరాలుగా తన భర్త అదనపు కట్నం కోసం అత్త వేధిస్తుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుకెస్‌ఐ తెలిపారు.

### వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**తెలకపల్లి:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన శివ, ప్రశాంత్ బైక్‌పై వెళ్తుండగా ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో వెనక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న శివకు తీవ్రగాయాలు కాగా ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. శివను నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి తీవ్రంగా ఉండడంతో యెన్నం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

**తిమ్మాజిపేట:** మండలంలోని లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన ముడావత్ లాలు బైకుపై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో లాలు తలకు, చేతికి గాయం అయినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం లాలు వ్యవసాయ పొలంలో పనులు ముగించుకొని ఇంటికి బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో లాలు గాయపడ్డాడు. చికిత్స కోసం జడ్చర్ల లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లాలు భార్య ముడావత్ మన్నీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ఏడాదిలో 'రైల్వే' ఫ్యాక్టరీ పూర్తి


గద్వాల రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ

- అలంపూర్ రైల్వే కోచ్ పనులు వేగవంతం
- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ
- అమృత్ భారత్ స్కీం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పరిశీలన
- మహబూబ్‌నగర్, గద్వాల, జోగుళాంబ రైల్వే హాల్ట్ సందర్శన


జోగుళాంబ రైల్వే హాల్ట్‌లో అభివృద్ధి పనుల నమూనా పరిశీలిస్తూ..

**గద్వాల న్యూటౌన్/స్టేషన్ మహబూబ్‌నగర్/ఉండవెల్లి:** అలంపూర్‌లో చేపడుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు జూన్ 2026 నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్, గద్వాల, జోగుళాంబ రైల్వే హాల్ట్‌లకు చేరుకొని అక్కడ చేపట్టిన అభివృద్ధి పనుల మ్యాప్‌లు, నమూనాలను పరిశీలించారు. ముందుగా ప్రత్యేక రైలులో గద్వాలకు వచ్చిన జీఎం రైల్వేట్రాక్, పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యల వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన అధికారులతో కలిసి అమృత్ భారత్ స్కీం కింద చేపడుతున్న స్టేషన్, ప్లాట్‌ఫాం విస్తీర్ణం, ఆర్చి, వెహికిల్ పార్కింగ్, రోడ్ల పనులను పరిశీలించారు. వాటి పురోగతి గురించి అధికారుల ద్వారా వివరాలు ఆరా తీశారు.

### విడతల వారీగా ఫ్యాక్టరీ సామర్థ్యం పెంపు

శ్రీవాత్సవ మీడియాతో మాట్లాడుతూ.. అలంపూర్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో సగభాగం మరమ్మతుకు లోనైన కోచ్‌లను బాగు చేస్తారని, ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతి నెల 50 కోచ్‌లను మరమ్మత్తు చేస్తారని వివరించారు. అనంతరం ఈ ఫ్యాక్టరీ సామర్థ్యం 300 కోచ్‌లు మరమ్మత్తులు చేసేలా పెంచుతామని చెప్పారు. డబ్లింగ్ పనులు మొదటివిడతలో మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర వరకు, రెండోవిడతలో జోగుళాంబ స్టేషన్ వరకు చేపడతామన్నారు. అమృత్ భారత్ స్కీంలో అభివృద్ధి చేసేందుకు కొన్ని రైల్వే స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, ఇందులో గద్వాల రైల్వే స్టేషన్ ఒకటని చెప్పారు. ఈస్కీం కింద చేపడుతున్న పనులు జూన్ 2026 నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. హైదరాబాద్ రైల్వే డివిజన్‌లో గద్వాల రైల్వే స్టేషన్ ముఖ్యమైనదని, గద్వాల నుంచి రైళ్ల పొడిగింపునకు అనేక వినతులు అందాయని, దీనిపై చాలా విషయాలు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. జీఎం వెంట డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, చీఫ్ ఇంజినీర్ నాగభూషణం, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సాంబశివరావ్‌తో పలువురు అధికారులు ఉన్నారు. ఇదిలాఉండగా, జీఎంను సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ రైల్వేశంకర్ కలిసి వినతిపత్రం అందించారు. గద్వాల రైల్వే ఉద్యోగుల కుటుంబాల కోసం వ్యాయామశాల, గ్రౌండ్ ఏర్పాటు చేయాలని, గ్యాంగ్‌మెన్‌లకు రెస్ట్, టూల్ రూంలు, ఎలక్ట్రికల్ భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న జోనల్, డివిజన్, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ చేపట్టాలని కోరారు.

### జోగుళాంబ రైల్వే హాల్ట్ పనులు వేగవంతం

జోగుళాంబ హాల్ట్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చెయ్యాలని జీఎం అధికారులకు సూచించారు. రైల్వే హాల్ట్ ముందర ఉన్న తోరణం, వాహనాల పార్కింగ్, హైలెవల్ ప్లాట్‌ఫాం, ప్లాట్‌ఫాం షెడ్, రెస్ట్ రూంలో ఏసీ వసతి, ప్రహరి గోడల డిజైన్లు పరిశీలించారు. అభివృద్ధి పనుల వల్ల ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, నూతన గదుల నిర్మాణం పూర్తయిన వెంటనే టికెట్ కౌంటర్ గదిని అందులోకి మార్చాలని అన్నారు.

# మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, పీడీపై సస్పెన్షన్ వేటు

సాక్షి ఎఫెక్ట్..

**ధన్వాడ:** మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమైె అఫ్రానను సస్పెన్షన్ చేస్తూ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ఉత్తర్వులు జారీచేశారు. అలాగే పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న పీడీ తులసీదాస్‌ను విధుల నుంచి తొలగిస్తూ గురువారం రాత్రి సంబంధిత అధికారులకు ఉత్తర్వులను పంపిచారు. గతవారం సాక్షిలో ''మోడల్ స్కూల్ కంపు కంపు'' శీర్షికపై స్పందించిన అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షించి విద్యార్థులు ఎందుకు ఆందోళన చేయాల్సి వచ్చింది.. మరుసటి రోజు పాఠశాల సమయంలో రోడ్డుపై రాస్తారోకో చేసేందుకు ఎలా అనుమతిచ్చారు అనే విషయాలపై ఉన్నతాధికారులకు వివరణ పంపిచారు. అయితే ఇక్కడ కేజీబీవీ టైప్–4 హాస్టల్‌లో విద్యార్థులు డ్రైనేజీ సమస్య, మరుగుదొడ్ల సమస్యపై అధికారులు స్పందించకపోవడంతో రాస్తారోకో చేశారు. కాని వీటిని పర్యవేక్షించే అధికారులు కేజీబీవీ ఎస్‌ఓపై మాత్రం ఎలాంటి చర్యలను తీసుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం

కేఎల్‌ఐ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి


వెల్దండలో కేఎల్‌ఐ కాల్వను పరిశీలిస్తున్న ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, అధికారులు

**వెల్దండ:** కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా చివరి ఆయకట్టు రంగారెడ్డి జిల్లా నాగిళ్ల వరకు రైతులకు సాగునీరందించడానికి కృషిచేస్తామని ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లోని కేఎల్‌ఐ కాల్వలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేఎల్‌ఐ కాల్వలో భాగంగా డి–82కాల్వ ద్వారా రైతులకు సాగునీరందిస్తామన్నారు. రైతులు ఇష్టానుసారంగా కాల్వపై సిమెంట్ పైపులు వేసి దారులు చేయడంతో కాల్వలకు గండిపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి కాల్వకు అడ్డంగా సిమెంట్ పైపులు వేయడంతో నీటి ప్రవాహంతో పైపులకు చెత్తాచెదారం అడ్డు పడడంతో తరచుగా కాల్వలకు గండి పడి నష్టం కలుగుతుదన్నారు. చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు వివరించారు. డి–82 కాల్వ పనులు దాదాపుగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేసి కేఎల్‌ఐ కాల్వ నీరు పారించడానికి కృషిచేస్తున్నట్లు వివరించారు. వెల్దండ సమీపంలో కాల్వను పరిశీలించిన అధికారులను కాల్వపై వంతెనే నిర్మించాలని రైతులు విన్నవించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఈ శ్రీకాంత్, డీఈఈలు దేవన్న, బుచ్చిబాబు, ఏఈలు ప్రభాకర్, మాల్యా తదితరులు ఉన్నారు.

# ఉత్సాహంగా కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు


కబడ్డీ క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** యువ తెలంగాణ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను శుక్రవారం జిల్లాకేంద్రంలోని స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో యువ తెలంగాణ చాంపియన్‌షిప్ సెలక్షన్స్‌కు సంబంధించి ముందుగా జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు 3న ఉదయం 9గంటలకు ఎల్‌బీ స్టేడియంలో రిపోర్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి నర్సింహులు, కార్యనిర్వాహక కార్యదర్శి బాల్‌రాజయ్య, శ్రీనివాసులు, గణేశ్ పాల్గొన్నారు.

**ఎంపికైన క్రీడాకారులు**

మహేశ్, హేమంత్, మహిపాల్, అరవింద్, పాండు, కౌశిక్, శ్రీకాంత్, హన్యానాయక్, శివ, శ్రీహరి, వినయ్, చందు, సురేశ్, కె.శ్రీకాంత్, రాకేష్‌కుమార్.

# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

- కమ్యూనిస్టు పార్టీల చరిత్ర అజరామరం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


పట్టణంలో భారీ ర్యాలీ

**కల్వకుర్తి రూరల్:** కమ్యూనిస్టు పార్టీలకు వందేళ్ల చరిత్ర ఉందని.. పార్టీ సూర్యోదయం ఉన్నంత వరకు ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో పార్టీ జిల్లా మూడో మహాసభలు జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టుల చరిత్ర త్యాగాల పునాదులపై ఏర్పాటైందని.. ఎవరికి ఏ కష్టం వచ్చినా తీర్చే వరకు పోరాడే పార్టీ అన్నారు. భూ పోరాటాలు చేసి లక్షలాదిమంది పేదలకు భూ పంపిణీ చేయించామని.. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, అంగన్‌వాడీలు తదితరుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసే ఏకైక పార్టీ తమదేనని తెలిపారు. ప్రతి మూడేళ్లకు ఓసారి మహాసభలు నిర్వహించి దేశంలో ఏ పార్టీ ఏ విధంగా ఉందో సమాలోచనలు చేసి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. దేశంలో బీజేపీ ప్రమాదకర పార్టీ కావడంతోనే కాంగ్రెస్‌కు అండగా ఉండి పేదల అభ్యున్నతికి ప్రయత్నిస్తున్నామన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎర్రజెండా ఎగిరేలా అన్నిచోట్ల పోటీ చేయాలని కోరారు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి కమ్యూనిస్టులను అంతం చేసేందుకు గడువు విధించారని.. ఎవరితోనూ సాధ్యం కాదన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ఏకమైనప్పుడు ఢిల్లీ ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురుతుందని తెలిపారు. మావోయిస్ట్ అగ్రనేత కేశవరావును హత్య చేయడం దారుణమని.. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా దహనం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించే వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్రవేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. డిసెంబర్‌లో ఖమ్మం జిల్లాలో పార్టీ వందేళ్ల వేడుకలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. రాబోయే మూడేళ్లు ప్రజల పక్షాన పోరాటం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన వివరించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మానవజన్మ ఉన్నంత వరకు కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని.. ప్రజా సమస్యలే అజెండాగా ఉన్న కమ్యూనిస్టు పార్టీని ఎవరూ ఏం చేయలేరని చెప్పారు. ఎర్రజెండా నీడన ప్రతి ఒక్కరూ ఉంటారన్నారు. పట్టణంలోని గచ్చుబావి నుంచి బహిరంగ సభ వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వార్ల వెంకటయ్య, డా. శ్రీనివాస్, కేశవగౌడ్, ఫయాజ్ పరశురాములు, చంద్రమౌళి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

### గంగాభవానీ ఆలయంలో చోరీ


చోరీకి గురైన ఆలయం

**చిన్నచింతకుంట:** మండల కేంద్రంలోని శ్రీ గంగా భవానీ మాత ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. చిన్నచింతకుంట ఎస్‌ఐ రాంలాల్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం ఆలయం తలుపులకు ఉన్న తాళాలను పగులగొట్టి అమ్మవారి చైను, బంగారు పుస్తెల తాడు, వెండి ముఖం, రెండు చేతులు, ముక్కెర, కిరీటం, వడ్డానాన్ని ఎత్తుకెళ్లారు. ఈ ఆభరణాల విలువ రూ. 2 లక్షలు ఉంటుంది. ఆలయాన్ని శుభ్రపరిచే నిరంటి కల్పన శుక్రవారం ఆలయానికి వెళ్లగా తాళాలు విరగొట్టి ఉండడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# కొత్త సత్రంలో అన్నప్రసాదం కొరత


సత్రంలో అన్నప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

**అలంపూర్:** ప్రసాద్ స్కీంలో భాగంగా శ్రీ బాలబ్రహ్మేశ్వరస్వామి నిత్య అన్నదాన సత్రంలో శుక్రవారం భక్తులకు అన్నప్రసాద కొరత ఏర్పడింది. అన్నదానంపై నిర్వాహకులు ఆలయాల్లో ప్రచారం చేయడంతో దర్శనానికి వచ్చిన భక్తులు ఒక్కసారిగా సత్రం వద్దకు చేరుకోవడంతో అన్నప్రసాదం కొరత నెలకొంది. శ్రావణ మాసం రెండో శుక్రవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు మధ్యాహ్న సమయంలో అన్నదాన సత్రానికి ఒక్కసారి వెళ్లడంతో క్యూలైన్లలో బారులు తీరారు. భోజన హాల్ నిండిపోవడంతో ఆలయ సిబ్బంది బయట ఉన్న భక్తులను లోపలికి రానివ్వలేదు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు బీజేపీ స్థానిక నాయకులతో కలిసి అన్నదాన సత్రాన్ని సందర్శించారు. భక్తుల ఇబ్బందులను ఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. రూ. 10 కోట్ల ఆదాయం ఉన్న ఆలయంలో కనీసం భక్తులకు అన్నప్రసాదం అందజేయకపోతే ఎలా అని బీజేపీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ ప్రశ్నించారు. ఈ విషయమై ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ స్పందిస్తూ.. రోజు మాదిరిగానే అన్న ప్రసాదం తయారు చేశామని, కానీ ఒక్కసారి భక్తుల రద్దీ పెరగడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. అయినా భక్తులందరికీ అన్నప్రసాదం దశల వారిగా అందించామని తెలిపారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

# ఎగువ నుంచి జూరాలకు భారీగా వరద

- ప్రాజెక్టుకు 2.15లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 19 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 2.13 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు..


జూరాల నుంచి 19 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం

**ధరూరు/ఆత్మకూర్:** కర్ణాటక, మహరాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 2.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో ప్రాజెక్టు 19 క్రస్టు గేట్లను ఎత్తి 1.86 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 23,729 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 44 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,250 క్యూసెక్కులు, కుడి కాల్వకు 650 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 600 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు కలిపి 2.13 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.498 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**వేగవంతంగా విద్యుదుత్పత్తి ...**

శుక్రవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 180.873 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 215.287 మిలియన్ యూనిట్లు కలిపి మొత్తం 396.160 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

**ఎగువన ప్రాజెక్టుల స్థితి..**

జూరాల ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 103.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1.49 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.40 లక్షల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 34.48 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 25 గేట్లను ఎత్తి జూరాలకు 1.31 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**12 గేట్ల ద్వారా నీటి విడుదల**

**రాజోళి:** సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ఎగువ నుంచి 48వేల క్యూసెక్కు ఇన్‌ఫ్లో రాగా..12 గేట్లను మీటర్ మేర తెరిచి 47,448 క్యూసెక్కుల నీటిని దిగువకు, 1,847 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

# డెంగీపై కేసులపై ప్రత్యేక నజర్


మోతీనగర్‌లో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ

- ఏఎల్‌ఓ ఆపరేషన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన ఆరోగ్యశాఖ
- ఇప్పటి వరకు 91 కేసులు నమోదు
- డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు

**పాలమూరు:** జిల్లాలో డెంగీ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయి. ఒకవైపు ఆరోగ్య శాఖ అధికారులు యాంటీ లార్వా ఆపరేషన్స్‌తో పాటు ఫీవర్ సర్వే చేస్తున్న పాజిటివ్ కేసులు క్రమంగా రెట్టింపు అవుతున్నాయి. ఆరోగ్య శాఖ అధికారులు జిల్లాలో అర్బన్ ఏరియాలో 41 హైరిస్క్ ప్రాంతాలు, రూరల్ ఏరియాలో 20 హైరిస్క్ ఏరియాలను గుర్తించి ఆ ఏరియాల్లో ప్రతి రోజు ఏఎల్‌ఓ ఆపరేషన్స్ చేయడంతో పాటు ఇంటింటి ఫీవర్ సర్వే కొనసాగిస్తున్నారు. పాజిటివ్ వచ్చిన ఇంట్లోని ప్రతి గదిలో అన్ని మూలాలకు ఇండోర్ స్ప్రే చేయడంతో పాటు ఆ చుట్టు పక్కల సైతం 50 నుంచి 100 ఇళ్ల వరకు యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆరోగ్య శాఖ పరిధిలో మొత్తం 91 డెంగీ పాజిటివ్ కేసులు వస్తే.. అర్బన్ ఏరియాలో 60 కేసులు నమోదు అయ్యాయి. శుక్రవారం జిల్లావ్యాప్తంగా డెంగీ కేసులపై ప్రత్యేక బృందాలు తనిఖీలు చేయగా, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని రామయ్యబౌళి, సద్దలగుండు, మోతీనగర్ ఏరియాలో పర్యటించారు. డెంగీ బాధితులను పరామర్శించి స్థానిక పరిస్థితులపై డీఎంహెచ్‌ఓ ఆరా తీశారు.

**ఇంటింటి ఫీవర్ సర్వే చేస్తున్నాం..**

ప్రతి ఇంట్లో తోక పురుగులు లేకుండా చూసుకోవాలి. నిత్యం క్లోరినేషన్ చేసుకోవడంతో పాటు దోమ తెరలు, నీటి విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి. హైరిస్క్ ఏరియాల్లో ఏఎల్‌ఓ ఆపరేషన్స్‌లో భాగంగా ఫాగింగ్ చేయిస్తున్నాం. మరీ ముఖ్యంగా ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తిస్తున్నాం. ప్రస్తుతం కేసులు నమోదు అవుతున్న ఏరియాల్లో అనుమానితుల నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. – డాక్టర్ కృష్ణ, డీఎంహెచ్‌ఓ

**జిల్లాలో 61 హైరిస్క్ ప్రాంతాలు గుర్తింపు**

జిల్లా ఆరోగ్య శాఖలోని మలేరియా విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో మూడేళ్ల కాలంలో ఎక్కువగా డెంగీ కేసులు వస్తున్న 61 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించారు. ఇందులో ప్రధానంగా సద్దలగుండు, మోతీనగర్, షాషాబ్‌గుట్ట, జైనల్లీపూర్, అయ్యవారిపల్లి, క్రిస్టియన్‌పల్లి, కోయనగర్, రామయ్యబౌళి, పాత పాలమూరు, ఎదిర, సీసీకుంట, జానంపేట, కోయనగర్, బీకే రెడ్డి కాలనీ, అయోధ్యనగర్, వీరన్నపేట, ప్రేమ్‌నగర్, మూసాపేట ఏరియాలున్నాయి. ఈ ప్రాంతాల్లో ఉండే ఇళ్లను ప్రత్యేకంగా బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయి. ప్రతి రోజు ఇంటింటికి తిరుగుతూ ఇళ్లలో జ్వరపీడితులు ఉన్నారా? ఇతర ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అనే అంశంపై ఆరా తీస్తున్నారు.